ప్రజాశక్తి

బుధవారం 19 ఫిబ్రవరి 2025 | 5 | అనంతపురం



జెఎన్‌టియు విసిగా సుదర్శనరావు



విసి సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్‌గా హెచ్.సుదర్శన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. అంతకు మునుపు వైస్ ఛాన్సలర్‌గా శ్రీనివాసరావు ఉండేవారు. ప్రభుత్వం మార్పు జరిగాక ఆయన తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి మూడు మాసాలుగా సుదర్శన్‌రావు జెఎన్‌టియు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన్నే ఇప్పుడు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. అనంతపురం జెఎన్‌టియులోనే అధ్యాపకులుగా ఈయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసరుగా పనిచేస్తున్న ఆయన ఇక్కడే వైస్ ఛాన్సలరుగా నియమితులవడంతో ఇక్కడి పరిపాలనా వ్యవహారాల మీద చక్కటి అవగాహన ఉండనుంది.

సుదీర్ఘమైన బోధానా అనుభవం

వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన సుదర్శన్‌రావుకు సుదీర్ఘమన బోధనా అనుభవముంది. 39 ఏళ్లుగా బోధానా రంగంలో పనిచేస్తున్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతపురం జెఎన్‌టియు వైస్ ప్రిన్సిపాల్‌గానూ, రెక్టార్‌గానూ పనిచేశారు. హైదరాబాద్ జెఎన్‌టియు బిక్రాడ్ డైరెక్టర్‌గానూ పనిచేశారు.

ఒత్తిడి భరించలేక.. చనిపోతున్నారు..!



ఫీజు ఒత్తిడితో జనవరి 23న అనంత నారాయణ కళాశాలలో ఆత్మహత్య చేసుకుని మరణించిన చైతన (ఫైల్‌ఫొటో)



పిల్లల భవిష్యత్తు బాగుండాలని.. ఎన్నో ఆశలతో తల్లిదండ్రులు ఆర్థిక భారాన్ని తమ భుజాలపై వేసుకుని పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుంటారు. పిల్లల భవిష్యత్తును బంగారు మయం చేయాలనుకునే తల్లిదండ్రుల తపన ఆదిలోనే మృగ్యమైపోతోంది. ఆశల వేటలో చదువులు, ఆర్థికపరమైన ఒత్తిడులను ఎదుర్కొలేక పిల్లలు అర్ధాంతరంగా జీవితాలను చాలిస్తున్నారు. కుటుంబాలకు భవిష్యత్‌లో వెలుగు దివ్వెలవుతారనుకుంటే చీకట్లు నింపి వెలుతున్నారు. అనంతపురం జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం జరిగిన విద్యార్థి ఆత్మహత్య ఘటనతో కలిపి ఈ ఏడాదిలో ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. నెల రోజుల వ్యవధిలోపే ఇద్దరు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇందులో ఒకరిది ఫీజు ఒత్తిడి అయితే.. మరొకరిది చదువుల ఒత్తిడితో అర్ధాంతరంగా తనువు చాలించారు.



మంగళవారం నాడు ఎస్ఆర్ కళాశాల చదువు ఒత్తిడి తాళలేక ఆత్మహత్య చేసుకున్న శ్రీకాంత్ (ఫైల్‌ఫొటో



ఎస్ఆర్ కళాశాల వద్ద శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గత నెల జనవరి 23వ తేదీన చైతన్య అనే విద్యార్థి అనంతపురం నగరంలోని నారాయణ కళాశాల తరగతి గది మూడవ అంతస్తు నుంచి అందరూ చూస్తుండగానే కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది సిసి పుటేజుల్లోనూ రావడంతో దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఫీజు కట్టలేదని యాజామాన్యం ఒత్తిడి చేయడంతో ఆ విద్యార్థి బలవన్మరణం చెందినట్టు ఆరోపణలొచ్చాయి. అది మరువక ముందే మంగళవారం నాడు మరో ఘటన చోటు చేసుకుంది. అనంతపురం నగర శివారులోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతన్న శ్రీకాంత్ కళాశాల వెనుకవైపునున్న దానిమ్మ తోటలోకెళ్లి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువుల ఒత్తిడితోనే ఆ విద్యార్థి మరణించినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

కార్పొరేట్ కళాశాలల ఒత్తిడితోనే ఆత్మహత్యలు ?

కార్పొరేట్ కళాశాల్లో విద్యార్థులపై రెండు రకాలైన ఒత్తిళ్లు ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మొదటి ఫీజుల ఒత్తిడి కాగా, రెండవది ర్యాంకుల సాధన కోసం సాగుతున్న చదువుల ఒత్తిడిగా తెలుస్తోంది. ఇందుకు జిల్లాలో జరిగిన రెండు ఆత్మహత్యలే సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నారాయణ విద్యా సంస్థలో చనిపోయిన చైతన్య ఫీజు ఒత్తిడి కాగా, ఎస్ఆర్‌లో చనిపోయిన శ్రీకాంత్ చదువుల ఒత్తిడి కారణమని తెలుస్తోంది. ఈ కళాశాలల్లో విపరీతమైన ఒత్తిడి విద్యార్థులపై పడుతోంది. రాత్రి సమయాల్లో 12 గంటల వరకు విద్యార్థులను బలవంతంగా స్టడీ హవర్స్ పెడుతున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. ఆ తరువాత తెల్లవారుజామున నాలుగు గంటలకు తిరిగి ప్రారంభమవుతున్నాయి. రోజుల్లో నాలుగైదు గంటలు కూడా నిద్ర ఉండని పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థులు విపరీతమైన ఒత్తిడి గురవుతున్నారు.

- ప్రాణం తీస్తున్న ఫీజు, చదువుల ఒత్తిడి..!
- అనంతలో మరో విద్యార్థి బలి
- నెలలోపే ఇద్దరు ఆత్మహత్య
- ఫీజు, చదువు ఒత్తిళ్లే కారణం..
- తల్లిదండ్రులకు గుండెకోత

విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలి




అనంతపురం జిల్లాలో విద్యార్థుల మరణాలు వరుసగా సంభవిస్తున్నాయి. గత నెలలోనే నారాయణ విద్యా సంస్థల్లో ఒక విద్యార్థి తరగతి గది మూడవ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది మరువక ముందే మరో విద్యార్థి ఇప్పుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మరణాలపై అధికారులు వెంటనే స్పందించి సమగ్రమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫీజుల ఒత్తిడులు, చదువుల ఒత్తిడితోనే ఇవి సంభవిస్తున్నా యన్నారు. వాటిని తగ్గించేందుక తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓతూరు పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, అనంతపురం.

శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె విజయవంతం

- సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అమిలినేని హామీ
- మార్చి 3వ తేదీలోపు పెండింగ్ వేతనాలు ఇస్తాం
- ఎమ్మెల్యే హామీతో సమ్మె విరమణ



సిఐటియు, తాగునీటి సరఫరా కార్మికులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చలు జరుపుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్, కళ్యాణదుర్గం రూరల్

పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం రాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లిన శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల పోరాటం విజయవంతం అయ్యింది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కార్మిక సంఘాల నాయకులతో మంగళవారం సాయంత్రం చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో కార్మికులు మంగళవారం రాత్రి నుంచే విధుల్లోకి చేరారు. ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిఐటియు నాయకులు, కార్మికుల మధ్య మంగళవారం సాయంత్రం నుంచి సుదీర్ఘ చర్చలు జరిపారు. ఇందులో పలు సమస్యలను పరిష్కరించేలా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మార్చి మూడో తేదీ లోపు పీఏబీఆర్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, మడకశిర, పరిగి కార్మికుల బకాయి జీతాలు చెల్లిస్తామన్నారు. బకాయి పడ్డ 30 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం కార్మికులకు కాంట్రాక్టర్ శివ శంకర్ రెడ్డి కార్మికుల ఖాతా నుంచి కోత విధించిన జీతం నెలకు 2500 రూపాయలు చొప్పున రానున్న 5 నెలలు బకాయి ఉన్న డబ్బులను వెంటనే కార్మికుల ఖాతా నందు జమ చేయిస్తామని తెలిపారు. కార్మికులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయిస్తామని చెప్పారు. కాంట్రాక్టర్ శివ శంకర్ రెడ్డి జీతాలు బకాయి ఉన్న కార్మికులకు (తొలగించిన కార్మికులకు) చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంప్ హౌస్ వద్ద ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 2024 సమ్మె కాలానికి వేతనాలు కార్మికుల ఖాతాల్లో వేస్తామన్నారు. పీఏబీఆర్ డ్యామ్ వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్లతో పాటు ఇతర చిన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. ఒక వేళ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జీతాలు వేయని పక్షంలో తన సొంత నిధులతో వేతనాలు ఇస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు హామీ ఇవ్వడంతో నాయకులు అంగీకరించి సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు పిఎబిఆర్ డ్యాం కళ్యాణదుర్గంలో మోటార్లను ఆన్ చేశారు. ఈ చర్చల్లో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, తాగునీటి సరఫరా జిల్లా సెక్రటరీ రాము, కళ్యాణ్ దుర్గం యూనియన్ నాయకులు నరేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, పీఏబీఆర్ డ్యాం నాయకులు కొండారెడ్డి, అశోక్, గంగాధర, లోకేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు దూరం చేసే కుట్ర

భూ ఆధార్‌ను నిలిపేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతు విశిష్ట సంఖ్య (భూ ఆధార్) పేరుతో రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను దూరం చేసేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప విమర్శించారు. తక్షణం దీనిని నిలిపేయాలని మంగళవారం ఆయన ఓ ప్రకనలో డిమాండ్ చేశారు. భూ ఆధార్ నమోదు చేసుకున్న వారికి మాత్రమే పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం, పంటల బీమా వంటి రైతు సంక్షేమ పథకాలు వర్తిస్తాయనే ప్రచారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని చెప్పారు. భూ ఆధార్ నమోదు కాని వారికి సంక్షేమ పథకాలు వర్తించవని బెదిరింపులకు ప్రభుత్వం పాల్పడడం సరికాదన్నారు. భూ ఆధార్ సమోదు ప్రక్రియలో భూమిలేని లక్షలాదిమంది కౌలు రైతులకు ఎలాంటి గుర్తింపు ఉండదన్నారు. చుక్కల భూములు ఉన్న రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో చూపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. జిల్లాలో 70 నుంచి 80 శాతం మంది రైతులు అసైన్‌మెంట్ భూముల సాగులో ఉన్నారన్నారు. ఇలాంటి వారందరికీ భూ ఆధార్‌తో నష్టం వాటిల్లుతుందన్నారు. కేంద్రం చెప్పిన వాటిన్నింటికీ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తలూపడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం భూమి మీద నుంచి రైతులను దూరం చేసి, వారి భూములను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడంలో భాగంగా రీసర్వే, భూ ఆధార్ నమోదు చేస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భూ ఆధార్‌ను నిలిపేసలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు రక్షణ కల్పించండి

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుని, యూనివర్సిటీ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైస్‌ఛాన్సలర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఛార్జీల మోత, మరోవైపు హాస్టల్ నిర్వహణ సరిగా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థినుల బాత్‌రూములకు రక్షణ గోడలు లేక పోవడం, ప్రహరీ లేక పోవడం అత్యంత దుర్మార్గం అన్నారు. ఈ సమస్యలన్నింటిపై వైస్ ఛాన్సలర్ కోరి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల మాన, ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, విసిపై ఉందన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరిన విద్యార్థులపై విసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించి, విసిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సబ్ డివిజన్ సర్వే పక్కాగా చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్లూరు

రీసర్వే అర్జీలకు సంబంధించి సబ్ డివిజన్ సర్వే పక్కాగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పుట్లూరు మండలంలోని సూరేపల్లి గ్రామ పరిధిలో రీసర్వే అర్జీని పరిశీలించి, సబ్ డివిజన్ చేపట్టడంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా అర్జీదారునితో మాట్లాడుతూ మీరు ఎంతమంది అన్నదమ్ములు, రీసర్వే గ్రామసభ ఎప్పుడు జరిగింది.. ఎందుకు విడిపోవాలని అనుకున్నారు, తదితర పూర్తిస్థాయి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత గ్రామ మ్యాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులకు ఇచ్చే సబ్ డివిజన్ సర్వేకు సంబంధించిన నోటీసులో సర్వే, బౌండరీ ఫిక్స్ చేయాలన్నారు. నోటీసుల సమయం ఏడు రోజులు ఇవ్వాలన్నారు. నోటీసులను సంబంధిత గ్రామ సచివాలయంలో అతికించాలన్నారు. అర్జీదారులు, వారి కుటుంబ సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. అర్జీదారు పొలం చుట్టుపక్కల రైతులు కూడా సర్వే సమయంలో వచ్చేలా తెలియజేయాలన్నారు. మండల సర్వే రిపోర్ట్ కూడా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కేశవనాయుడు, తహశీల్దార్ శేషారెడ్డి, డిఐ వేణుగోపాల్‌గుప్తా, మండల సర్వేయర్ శాంతి, వీఆర్వో వెంకటేశ్వరరావు, వీఆర్ఏ కొండన్న, తదితరులు పాల్గొన్నారు.

రుణ మంజూరులో నిర్లక్ష్యం వద్దు

వందశాతం లక్ష్యం చేరుకోవాలి -ఎంపి అంబిక, కలెక్టర్ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సబ్సిడీ పథకాలు, రైతులకు సంబంధించి నిర్ధేశించిన రుణ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వంద శాతం రుణ మంజూరును బ్యాంకర్లు చేరుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్ తెలియజేశారు. జిల్లా పరిషత్ డిపిఆర్‌సి భవనంలో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు విరివిగా పంట రుణాలను అందించి తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. సామాజిక బాధ్యత కింద జిల్లాలోని 51 గ్రామాల్లో ఒక మినరల్ ప్లాంట్ చొప్పున ఏర్పాటు చేయాలని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల కోసం ఒక మినీ బస్సును అందించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకర్లకు ప్రతి మూడు నెలలకు కేటాయించిన రుణమంజూరు లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. 51 గ్రామాల్లో ఆర్ఒ ప్లాంట్ల కోసం బ్యాంకులకు ప్రత్యేకంగా లేఖలు రాసి, అవి ఏర్పాటయ్యేలా చూడాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. స్టాండప్ ఇండియా పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నాటికి 39.34 శాతం మాత్రమే రుణాలు ఇచ్చారని, కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు ఆయా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు. అర్హత గల పశుసంవర్ధక, మత్స శాఖలకు చెందిన రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి నిర్దేశిత గడువులోపు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. రుణ మంజూరులో లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్న వారికి నోటీసులను జారీ చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం నర్సింగ్ రావు, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు, జిల్లా పరిశ్రమల శాఖ జెడ్ఎం శ్రీధర్, ఫిషరీష్ డిడి శ్రీనివాసనాయక్, మెప్మా పీడీ విశ్వజ్యోతి, చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డితో పాటు వివిధ బ్యాంక్ సీఈవోలు, మేనేజర్లు, పాల్గొన్నారు.

రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. మంగళవారం హుబ్లీలోని డివిజన్ కార్యాలయంలో నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ డివిజినల్ మేనేజర్ బేలామీనాను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాయదుర్గం రైల్వేస్టేషన్ కొత్త భవనంలో కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని విస్తరించాలని, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ప్రయాణికులకు 24 గంటలు సమాచారం అందేలా వ్యవస్థ మెరుగు పర్చాలని, సమాచార బోర్డులో రైళ్ల రాకపోకల సమగ్ర వివరాలను పొందుపర్చాలన్నారు. రైల్వే క్యాటరింగ్ ద్వారా అల్పాహారం వసతులు, రాయదుర్గం పట్టణ పరిధిలో రైల్వేట్రాక్‌కు ఇరువైపులా పశువుల నియంత్రికలు ఏర్పాటు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో రద్దయిన తిరుపతి- కదిరిదేవరపల్లి రైలును ప్రస్తుతం గుంతకల్లు వరకే పరిమితం చేశారని, దీన్ని తిరిగి రాయదుర్గం, బళ్ళారి మీదుగా పునరుద్ధరించాలన్నారు. అలాగే హొస్పేట నుంచి బెంగళూరు మధ్య నడుస్తున్న రైలును పునరుద్ధరించాలని, రాయదుర్గం మీదుగా వెళ్తున్న యస్వంతపూర్ - టాటానగర్, మైసూరు - వారణాసి, యస్వంతపూర్ - జైపూర్ రైళ్లను రాయదుర్గం స్టేషన్‌లో ఆపాలని కోరామన్నారు. వీటితోపాటు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

గంటలోనే బాలుని ఆచూకీ కనుగొన్న పోలీసులు

అనంతపురం క్రైం : మతిస్థిమితం లేక తప్పిపోయిన బాలున్ని గంటలోనే తల్లికి అప్పగించారు రూరల్ పోలీసులు. రూరల్ సీఐ శేఖర్ తెలిపిన వివరాల మేరకు కర్నూలు జిల్లా వెంకయ్య పల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి తన ఇద్దరు పిల్లలు సహా బిక్షాటన నిమిత్తం సోమవారం నగరానికి వచ్చింది. మంగళవారం ఉదయం తన పెద్ద కుమారుడైన ప్రభుదేవా తప్పిపోయాడు. వయస్సు 16 సంవత్సరాలు ఉన్నప్పటికీ ఆ అబ్బాయి మతిస్థిమితం ఉండడంవల్ల తిరిగి తమను చేరుకోవడం కష్టంగా భావించి సాయంత్రం స్థానిక రూరల్ పోలీసులను నాగలక్ష్మి ఆశ్రయించి తన మతిస్థిమితం లేని కుమారుడి ఆచూకీ కనుక్కొని అప్పగించాలని విన్నవించింది. ఈ నేపథ్యంలో అనంతపురం రూరల్ సిఐ శేఖర్, ఎస్ఐ రాంబాబులు ఏ మాత్రం ఆలస్యం లేకుండా ప్రత్యేక బందాలచే గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో... స్థానిక బళ్లారి బైపాస్ సమీపంలో ఉన్న ప్రభుదేవా ఆచూకీ కనుగొని తల్లి నాగలక్ష్మి కి గంటలోపే అప్పగించడంతో వారి నుండి హర్షం వ్యక్తం అయింది.



విలేకరులతో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్

స్వేఛ్చా వాతావరణంలో జీవిస్తున్న ప్రజలు

శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వచ్చాక ప్రజలు స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నారని శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రజా వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలు తీవ్ర భయబ్రాంతులతో జీవనం సాగించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల్లో స్వేచ్ఛ పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వానికి 90 శాతం ప్రజలు మద్దతు ఇచ్చి పట్టం కట్టారన్నారు. ఇందుకు అనుగుణంగానే ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడుతోందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగమే ఉచిత గ్యాస్ సిలిండర్, రూ.4వేల పింఛన్, వికలాంగులకు రూ.6వేలు అందిస్తోందన్నారు. త్వరలోనే మిగతా హామీల అమలుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇకపోతే విశాఖ స్టీల్ ప్లాంటును వైసీపీ ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయాలని చూస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.11,400 కోట్ల ఆర్థిక ప్యాకేజీ తీసుకొచ్చి ప్రయివేటీకరణ ఆపారన్నారు. రాష్ట్రం అభివృద్ధి కోసం 40కిపైగా పరిశ్రమలు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. అవన్నీ వస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అలాగే 16000కుపైగా ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ముస్లిముల కోసం ప్రత్యేక సబ్సిడీ రుణాలు అందిస్తోందని, అమరావతిలో హజ్ భవనం ఏర్పాటుతో పాటు హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష అందిస్తోందన్నారు. ఇంకా మసీదులు, స్మశాన వాటికలు, ఈద్గాలు అవసరమైన చోట ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం షరీఫ్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మొమెంటోతో ఘనంగా సన్మానించారు

బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోండి

కమిషనర్‌తో కాంట్రాక్టర్ల వేడుకోలు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో నెలలు తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లుల ఫైళ్లను ప్రాసెస్ చేయాలని కోరుతూ మంగళవారం కాంట్రాక్టర్లు కమిషనర్ బాలస్వామిని కలిసి విన్నవించారు. కమిషనర్ లాగిన్‌లో దీర్ఘకాలంగా ఫైళ్లు పెండింగ్‌లో ఉండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వేడుకున్నారు. కమిషన్ లాగిన్ నుంచి ఫైళ్లు ముందుకు కదిలితే ఎగ్జామినర్ అకౌంట్ సెక్షన్, పిఒ ఆఫీసు ఇలా అన్నిచోట్లకు వెళ్లి ఆమోదముద్ర పొందాల్సి ఉంటుందని అన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో బిల్లుల కదలిక జరిగితే డబ్బులు చేతికందే పరిస్థితి ఉంటుందని కమిషనర్‌కు తెలిపారు. దీనిపై కమిషనర్ బాలస్వామి స్పందిస్తూ తనకు 25 సంవత్సరాల అనుభవం ఉందని, ఈ ఆఫీస్ గురించి అంతా తెలుసన్నారు. బుధవారంలోగా ఫైళ్లను క్లియర్ చేస్తానని హామీ ఇచ్చారు. కమిషనర్ హామీపై కాంట్రాక్టర్లు ఆనందం వ్యక్తం చేశారు.

వడదెబ్బపై అవగాహన


ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ ఎడ్యుటర్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్ మంగళవారం వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండలో తిరగరాదన్నారు. ఎక్కడికైనా వెళ్లేటపుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వడదెబ్బకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం పద్మావతి, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో పంటలను కొనాలి

ఎంపీ, కలెక్టర్‌కు రైతుసంఘం వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పంటలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తేనే రైతులకు ఉపయోగమని రైతుసంఘం నాయకులు తెలిపారు. మిరప, పత్తి, పప్పు శనగ, సీడ్ జొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, 2024-25 ఖరీఫ్, రబీ పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని కోరుతూ రైతు, కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయం వద్ద ఎంపి అంబికా లక్ష్మినారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, జిల్లా నాయకుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 2024-25 ఖరీఫ్, రబీలో సాగుచేసిన మిరప, పత్తి, సీడ్ జొన్న, పప్పుశనగ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక దిక్కుతోచని పరిస్థితులలో ఉన్నారన్నారు. ప్రభుత్వం తక్షణం అన్ని పంటలకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అతివృష్టి, అనావృష్టితో 2024-25 ఖరీఫ్ రబీలో పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ప్రకటించి ఆదుకోవాలని కోరారు.



ఎంపీ అంబికాకు వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

'నక్ష'తో విప్లవాత్మకమైన మార్పులు

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ


నక్ష కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపి అంబికా, అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నక్ష కార్యక్రమం ద్వారా పట్టణ భూ రికార్డుల సృష్టి, నిర్వహణలో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. నగరంలోని పసుపుల కన్వెన్షన్ హాలులో కమిషనర్ బి.బాలస్వామి అధ్యక్షతన నక్ష కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ భూ రికార్డుల కోసం సమగ్ర, ఖచ్చితమైన జియో స్పేషియల్ డేటా బేస్‌ను రూపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం తీసుకొచ్చిందన్నారు. ఈ సర్వేను దశలవారీగా మూడు దశల్లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో దశను పూర్తి చేస్తే రూ.30కోట్లు ఇన్సెంటివ్ కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, ఆహుడా ఛైర్మన్ టిసి వరుణ్, కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్‌రెడ్డి : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

దళితుల ద్రోహి మాజీ సిఎం జగన్‌రెడ్డి అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. మంగళవారం అనంతపురంలోని స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ నమ్మించి గొంతు కోసిన జగన్‌రెడ్డి అధికారం పోయాక దళితులపై అమితమైన ప్రేమ వలకబోస్తున్నారని ఎద్దేవా చేశారు. దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబును జగన్ ఒకసభలో తన పక్కనే కూర్చోబెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ కులానికి చెందిన వ్యక్తిని కిడ్నాప్ చేసి హింసించిన కేసుతోపాటు అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన వల్లభనేని వంశీని జైలుకు వెళ్లి కలవడం అంటే దళితులపై అరాచకాలను ప్రోత్సహించడం కాదా? అని నిలదీశారు. జగన్‌కు భయపడి సొంత చెల్లి, తల్లి పక్క రాష్ట్రానికి వెళ్లి తలదాచుకున్నారు. సొంత బాబాయిని అన్యాయంగా గొడ్డలితో నరికి చంపిన దుర్మార్గుడని అన్నారు. జగన్‌రెడ్డి పాలనలో 200 మందికిపైగా దళితులను దారుణంగా హతమార్చారన్నారు. అలాంటి జగన్‌రెడ్డికి దళితుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

స.హ చట్టంపై పారదర్శకత ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం

సమాచార హక్కు చట్టం అమలుపై ప్రభుత్వానికి పారదర్శకత, అధికారులు జవాబు దారిగా ఉండాలని చట్టం జిల్లా అధ్యక్షులు ఎ.హొన్నూరప్ప అన్నారు. మంగళవారం నగరంలోని ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాచార హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎవి ప్రసాద్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిరాకరించే అధికారం ప్రభుత్వ వ్యవస్థలో ఏశాఖ, అధికారికీ లేదన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనం కోసం ఆర్‌టీఐ ఎంతో దోహదపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సహ చట్టం సభ్యులు రామలింగప్ప, ఇమామ్, ఎఐ శ్రీనాథ్, జాతీయ సేవాపథకం పిఒలు జి.ఆనంద్‌బాబు, ఎస్.పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి'పై అంగన్వాడీలకు శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంపై ఎంఇఒ కృష్ణయ్య, ఐసిడిఎస్ సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా తెలుగు, గణితం బోధనపై శిక్షకులు రవికుమార్, యల్లప్ప, హనుమంతు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేష్, సూపర్‌వైజర్లు సులాలిని, మధుమాలిని, సిడిపిఒ కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : జ్ఞానజ్యోతి కార్యక్రమంపై ఎంఇఒ, సిడిపిఒ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీ టీచర్లు బి.కరుణాకరన్, టి.రమేష్‌బాబు, జి.నారాయణస్వామి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు భారతి, అరుణ, ఓబుళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండలంలోని వేపులపర్తి, బ్రహ్మసముద్రం సెక్టార్ల సూపర్‌వైజర్లు రామాంజనమ్మ, కాసింబీ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు ఓబుళపతి, కృష్ణానాయక్, డిఆర్‌పి శిక్షకులు అర్చన, రామాంజనేయులు, జగదీష్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-పుట్లూరు

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులందరూ తప్పనిసరిగా రోజువారి బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని అరకటివేముల గ్రామ సచివాలయం నుంచి జిఎస్‌డబ్ల్యుఎస్‌పై జెడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, డిపిఒ నాగరాజునాయుడు, డిఎల్‌డిఒలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ మిస్సింగ్ సిటిజెన్‌కు సంబంధించి ప్రతి ఫంక్షనరీ రోజుకు రెండు చొప్పున మొత్తం పెండింగ్ పూర్తయ్యేంత వరకు చేపట్టాలన్నారు. వివిధ రకాల సేవలకు సంబంధించిన సర్వీసుల అమౌంట్‌ను రెండు రోజుల్లో ప్రభుత్వానికి జమ చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కేశవనాయుడు, తహశీల్దార్ శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు

పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ అధిష్టానం గుర్తింపు ఇస్తుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. టిడిపి గెలుపు కోసం పని చేసిన న్యాయవాది ఎన్.హేమాద్రికి అధిష్టానం అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమించిన నేపథ్యంలో మంగళవారం ఆలూరు రోడ్డులోని ఫంక్షన్ హాలులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన, మన అనే భేదాలు ఉన్నవారు.. లేనివారు.. బంధువులు అని చూసి పదవులు ఇవ్వమని.. పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమం అని డబ్బులు పంచి 'బటన్ నొక్కాం' అనే ధీమాతో కార్యకర్తలకు పక్కన పెట్టినందుకు నేడు ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదని గుర్తు చేశారు. కానీ టిడిపిలో ప్రతి కార్యకర్తనూ గుర్తించి నాయకులుగా తీర్చిదిద్దుతుందన్నారు. ఇందుకు ఉదాహరణ అడ్వకేట్ హేమాద్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

పట్టణంలోని పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని 18 మంది లబ్ధిదారులకు 6వ విడతల్లో మంజూరైన రూ.30.54 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జయరామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, టిడిపి డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గుమ్మనూరు వెంకటేసులు, జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

జిల్లా సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ నవీన్‌కుమార్


ధాన్యాలను పరిశీలిస్తున్న జిల్లా సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ నవీన్‌కుమార్

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులు సాగు విధానంలో మెళకువలు పాటిస్తే బీడు భూముల్లో సైతం అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ నవీన్‌కుమార్ సూచించారు. జిల్లా అధికారి డిపిఎం లక్ష్మానాయక్ ఆదేశాల మేరకు మంగళవారం విడపనకల్లు మండల పరిధిలోని ఉండబండ గ్రామంలో రైతు సుధాకర్ పొలంలో 0.75 ఎకరాలో సాగు విధానాలను రైతులకు వివరించారు. ఇందులో భాగంగా బీడు భూముల్లో ఆముదం, సజ్జ, కంది, గోరుచిక్కుడు, అనుములు వంటి దాదాపు 20 రకాల జీవ వైవిధ్య పంటలను రైతుతో వేయించారు. ఈ పంటల ద్వారా నేల సారవంతమై ఖరీఫ్‌లో వేయబోయే పంటల దిగుబడి అధికంగా వచ్చి రైతులు అధిక లాభాలు పొందుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎ సురేష్, ఉరవకొండ డివిజన్ మాస్టర్ ట్రైనర్ ధనుంజయ, విడపనకల్ మండల యాంకర్ తొలిసేనాయక్, ఎన్‌ఎఫ్‌ఐ సంధ్య, ఉండబండ నాయకుడు వన్నూరుస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి

అనంతపురం రూరల్ : తారకరత్న వర్థంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన మేరకు నగరంలోని అర్బన్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ తారకరత్న ఓవైపు సినిమాల్లో రాణిస్తూనే.. ఇంకోవైపు పార్టీకి సేవలందించారన్నారు. అలాంటి ఆయన చేసిన సేవలను మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ

నార్పల : మండల కేంద్రంలోని మండల మహిళా సంఘాల వెలుగు కార్యాలయంలో పలువురికి మంగళవారం పెరటి కోళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు), వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఉపేంద్ర, ఎపిఎం తిప్పమ్మ, వెటర్నరీ డాక్టర్ గోవిందరాజు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు పరిశీలన

నార్పల : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీరాములు, ఎఇ జనార్ధన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇ శ్రీరాములు మాట్లాడుతూ నిర్మాణ సమయంలోనే ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకుని పనులు నాణ్యతగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామేశ్వరి పాల్గొన్నారు.

అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రం సమీపంలోని కొండవద్ద వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అన్నదానం చేశారు. ముందుగా అమ్మవారికి పూజలు చేశారు.

కంటి అద్దాలు పంపిణీ

యాడికి : మండల పరిధిలో వేములపాడు వద్ద ఉన్న కెజిబివి బాలికల విద్యాలయంతో పాటు యాడికిలోని నెంబర్-2, ఇతర పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు 49 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తాడిపత్రి డివిజన్ జిపిఎంఒఒ మధుసూదన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజిబివి బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ కొమ్ము నిర్మల, ఉపాధ్యాయనులు జి.జ్యోతి, పి.మహేశ్వరి, ఎఎన్ఎం లక్ష్మీనారాయణమ్మ, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.ఇందిరమ్మ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెసి పెద్దన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

కుందుర్పి : వేసవికాల ప్రారంభం అవుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో నీటిఎద్దడి సమస్య పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ లక్ష్మీశంకర్ అన్నారు. ఈమేరకు మంగళవారం మండల వ్యాప్తంగా చేతిపంపుల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కొన్ని గ్రామాల్లో చేతిపంపులకు మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాస్‌కుమార్, మండల కోఆర్డినేటర్ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అనంతపురం : విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు జె.వాసుప్రకాష్, వ్యవసాయాధికారి యు.సద్గురుడు, సిబ్బంది కలిసి కంబదూరు మండలంలోని మెయిన్ బజార్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్ (పెస్టిసైడ్స్) దుకాణాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పురుగు మందులపై తయారైన తేదీని ముద్రించకపోవడం, కాలం చెల్లిన పురుగు మందులు ఉండటంతో జప్తు చేసి స్థానిక మండల వ్యవసాయ అధికారికి తదుపరి చర్యలకు అప్పజెప్పారు.

పారిశుధ్య పనులు పరిశీలన


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని రామ్‌నగర్, కోవూర్‌నగర్, రహమత్ నగర్, గుల్జార్ పేట తదితర ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ బాలస్వామి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహమత్ నగర్, అండర్ బ్రిడ్జ్, ఎస్ఎస్-ఎస్ కళాశాల రోడ్డుకు ఇరువైపులా చెత్తను పూర్తిస్థాయిలో తొలిగించాలన్నారు. పని చేసిన తర్వాత ఫొటోలను తనకు పంపాలన్నారు. అలాగే రామ్‌నగర్ మినీపార్క్ ముందు ఉన్న కల్వర్ట్ ఓవర్ ఫ్లోను పరిశీలించి శానిటరీ ఇన్స్‌పెక్టర్ నాగేంద్రపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కల్వర్టులో అడ్డును తొలిగించి నీరు ప్రవహించేలా చేయాలని ఆదేశించారు.

విజేతలకు బహుమతులు అందజేత

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో బొలికొండ రంగనాథ స్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీల విజేతల ఎద్దుల యజమానులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ మంగళవారం బహుమతులు అందజేశారు. టిడిపి ఆధ్వర్యంలో ఒంగోలు జాతి జూనియర్, సీనియర్ వృషభాలకు రాతిదూలం లాగుడు పోటీలు జరిగాయి. పోటీల్లో విజేతలైన వృషబాల యజమానులకు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జి.వెంకటశివుడు యాదవ్, ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ, నాయకులు సొలమన్‌రాజ్, బి.చిన్నరెడ్డియాదవ్, బి.రంగస్వామిరెడ్డి యాదవ్, రామచంద్రయాదవ్, లక్ష్మీరంగయ్య, డేగ మద్దిలేటి, పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, కరిడికొండ సుధాకర్‌నాయుడు, ఎ.గోవర్ధన్‌గౌడ్, లక్ష్మణరావు, సర్పంచి యు.రామలింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

అనంతపురం కార్పొరేషన్ : వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరంలో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ బాలస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో తాగునీటి ఎద్దడిపై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. నీటి సరఫరాకు అంతరాయం కలిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ భాస్కర్‌రావు, ఇఇలు రాధాకృష్ణ, షాకీర్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

రహదారి వెడల్పుపై నిరసన

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని అనంతపురం-కడప ప్రధాన రహదారిపై గ్రామస్థులు మంగళవారం నిరసన చేపట్టారు. బొందలదిన్నె గ్రామంలో రహదారి వెడల్పు విషయంలో తమకు ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు రోడ్డుపైకి వచ్చి వాహనాలు నిలిపి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి రహదారి అధికారులతో మాట్లాడారు. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో వాహనాలను క్లియర్ చేశారు.


పెరటి కోళ్లతో అదనపు ఆదాయం

బుక్కరాయసముద్రం : పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు అదనంగా ఆదాయం పొందవచ్చని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పశుసంవర్ధ శాఖ, డిఆర్‌డిఎ వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘా సభ్యులు తమ ఇళ్లలో పెరటి కోళ్లు పెంచుకునేందుకు ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, డిఆర్‌డిఎ వెలుగు పీడీ ఈశ్వరయ్య, తహశీల్దార్ పుణ్యవతి, ఎడి రత్నాకర్, ఎంపిడిఒ సొలమన్, ఎపిఎం నారాయణస్వామి, టిడిపి మండల కన్వీనర్ అశోక్, ఎస్.నారాయణస్వామి, కేసన్న, ఓబుళపతి, పొడరాళ్ల రవీంద్ర, డిఆర్‌డిఎ వెలుగు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే తనిఖీ


యాడికి : మండలంలోని దయ్యాలమడుగు గ్రామంలో సర్వేనెంబర్ 435లో చేపట్టిన రీసర్వేను గుంతకల్లు ఆర్‌డిఒ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా సర్వే తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే గుంతకల్లు చంద్రశేఖర్‌రెడ్డి, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజ్‌కుమార్, మండల సర్వేయర్ శేషసాయి, గ్రామ రెవెన్యూ అధికారులు నరసింహరాజు, రాందాస్, గ్రామ సర్వేయర్ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

అనంతపురం సిటీ : నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవల పనితీరును వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ టెస్టుల రికార్డులు, హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ విధానానికి సంబంధించిన రిపోర్టులు, ఒపి సేవల వివరాలు, మాతా శిశు సంరక్షణ సేవలకు సంబంధించిన వివరాలను సమీక్షించి సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం రుద్రంపేటలో ఉండే విలేజ్ హెల్త్‌క్లినిక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఇబి.దేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, ఎన్‌హెచ్ఎం కిషోర్, ఫణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో క్యాట్, ప్యాట్, మ్యాట్ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులను ఎజిఎం సుబ్బారెడ్డి మంగళవారం అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పరీక్షల్లో ఇంతటి ఘన విజయాన్ని సాధించడం శ్రీచైతన్య విద్యాసంస్థకే సాధ్యమన్నారు. అనంతరం విజయం సాధించిన 16 మంది విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానంచ ఏశారు. 110 మంది విద్యార్థులను పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, ఎఒ గోపాల్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

ఉరవకొండ : ప్రతి రైతు తప్పనిసరిగా విశిష్టత గుర్తింపు కార్డు పొందాలని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ సూచించారు. మంగళవారం ఉరవకొండ, వెలిగొండ గ్రామాల్లో ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ రైతులు గుర్తింపు కార్డు తీసుకోవడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయన్నారు. ఇకపోతే శనగ పంటలో ఎండు తెగులు ఎక్కువగా సోకిందన్నారు. కావున రైతులు పంట మార్పిడిని విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భరత్, ఆత్మా ఎటిఎం కిన్నెర, రైతు సేవాకేంద్రం సిబ్బంది లీల, లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

మద్యం విక్రయిస్తే చర్యలు


ఇంటిని తనిఖీ చేస్తున్న ఎస్ఐ నగేష్

ప్రజాశక్తి-కుందుర్పి

గుడి, బడి సమీప ప్రాంతాల్లో ఎవరైనా మద్యం విక్రయాలు చేస్తే ఎంతటి వారనైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ నగేష్ హెచ్చరించారు. మంగళవారం 'బడి దగ్గర బెల్‌షాప్ నిర్వహణ' అనే శీర్షిక ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎస్ఐ మండల కేంద్రంలోని పలు ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించకూడదన్నారు. మరీ ముఖ్యంగా గుడి, బడి సమీపంలో అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా నాగేంద్ర ఇంటిని తనిఖీ చేసి బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు.

ఎస్ఇ సంపత్‌కుమార్ బదిలీని ఆపాలి

అనంతపురం : ఎపిఎస్‌పిడిసిఎల్ అనంతపురం సూపరింటెండెంట్ ఇంజినీర్ సంపత్‌కుమార్ బదిలీని నిలుపుదల చేయాలని వైసిపి నేత, మాజీమంత్రి సాకే శైలజనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత సామాజికవర్గానికి సంబంధించిన సంపత్‌కుమార్ జిల్లాలో అన్నివర్గాల ప్రజలతో మంచి సంబంధాలు ఉండడమే కాకుండా విధి నిర్వహణలో సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఎలాంటి ఆరోపణలు లేకపోయినప్పటికీ కొందరి ప్రయోజనాల కోసం సంపత్‌కుమార్‌ను బదిలీ చేయడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నించారు. విధినిర్వహణలో ఎక్కడా తప్పులు చేయకపోయినప్పటికీ సంపత్‌కుమార్‌ను వేధింపులతో బదిలీ చేయడం మంచిది కాదన్నారు. వెంటనే సంపత్‌కుమార్ బదిలీని ఆపాలని డిమాండ్ చేశారు.

ఉప్పరపల్లి సర్పంచ్‌కు సన్మానం


సర్పంచును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి పంచాయతీలోని సంతు గురు రవిదాస్ కాలనీ అభివృద్ధికి కృషి చేసిన సర్పంచు సావిత్రి శ్రీనివాసులును మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ సర్పంచి సావిత్రి శ్రీనివాసులు వికలాంగుల ప్రతి ఇంటికీ ఉచితంగా కొళాయి కనెక్షన్లు ఇవ్వడంతోపాటు ఇంటి గుత్తలను ఉచితంగా ఇప్పించారన్నారు. ఈనేపథ్యంలో సర్పంచుగా ఎన్నికై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి రంగస్వామి, వికలాంగులు శంకరప్ప, తిరుపాలు, కదిరప్ప పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపండి

అనంతపురం క్రైం : 1961 నుండి 1975 వరకూ రిక్రూట్ అయిన పోలీస్ సిబ్బంది ప్రొబేషన్ కాలానికి సంబంధించిన యాన్యువల్ ఇంక్రిమెంట్, వెయిటేజ్ ఇంక్రిమెంట్ సమస్యలకు పరిష్కారం చూపాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఎస్పీ జగదీష్‌కు మంగళవారం విన్నవించారు. ఇందులో భాగంగా సంఘం అధ్యక్షుడు మహబూబ్ సాహెబ్ (బాషా) ఆధ్వర్యంలో ఎస్పీని కలిసి సమస్యలను విన్నవించారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ పరిశీలించి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం నాయకులు నూర్ మహమ్మద్, భీమప్ప, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలకు పాల్పడితే పీడీ యాక్టు

అనంతపురం క్రైం : భూకబ్జాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అవసరమైతే పీడీ యాక్ట్ ఉపయోగిస్తామని త్రీటౌన్ సీఐ కె.శాంతిలాల్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు భూకబ్జాకు పాల్పడిన ఐదుగురిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నగరంలో అక్రమంగా, దౌర్జన్యంగా భూకబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎవరినీ ఉపేక్షించబోమని, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

పతకాలు సాధించిన కానిస్టేబుల్‌కు అభినందన

అనంతపురం క్రైం : ఎపి మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలలో నాలుగు పతకాలు సాధించిన కళ్యాణదుర్గం కానిస్టేబుల్ షఫీ ని జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు. పతకాలు ప్రదానం చేయడంతో పాటు కానిస్టేబుల్ కు సన్మానం చేశారు. వివరాల మేరకు ఆంధ్ర ప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలలో అన్ని జిల్లాల నుండి సుమారు 1000 మంది అథ్లెట్స్ పాల్గొన్నారు. ఈనెల 7,8,9 తేదిలలో స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో జరిగిన 100 మీటర్స్ ఈవెంట్ లో మూడవ స్థానం, 200 మీటర్స్ లో ప్రథమ స్థానం, 400 మీటర్స్ లో ప్రథమ స్థానం, 4%ఇ%100 రిలేలో రెండో స్థానం లో నిలిచి మొత్తం 4 పతకాలు సాధించాడు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కానిస్టేబుల్ షఫీని అభినందిస్తూ జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన ఛేంబర్లో మంగళవారం సన్మానించారు. వచ్చే నెల మార్చి నాలుగు నుండి తొమ్మిదవ తేదీ వరకు బెంగుళూరులో నిర్వహించే జాతీయ పోటీలకు అర్హత సాధించాడు.

'అమ్మ' సంస్థ రూ.లక్ష వితరణ


అనంతపురం : నగరంలోని బుడ్డప్పనగర్ కాలనీలో నివాసంటున్న మల్లేష్, ఝాన్సీ కుమారుడు బబ్లూ కంటి చూపునకు అమ్మ సంస్థ వ్యవస్థాపకులు రమణారెడ్డి మంగళవారం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. బబ్లూ తండ్రి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనేపథ్యంలో బబ్లూకు కంటి సమస్య రావడంతో వైద్యం కోసం రూ.1.20లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. పేదరికంతో అంత ఖర్చు చేయలేని బబ్లూ తల్లిదండ్రులు రమణారెడ్డిని ఆశ్రయించడంతో రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు.

వెట్‌ల్యాండ్ ప్రాధాన్యతపై అవగాహన

అనంతపురం సిటీ : స్థానిక ఎకాలజీ సెంటర్‌లో వరల్డ్ వెట్‌ల్యాండ్ ఫోరం బెంగళూరు ఆధ్వర్యంలో వెట్‌లాండ్స్ ప్రాముఖ్యత, కాపాడుకోవాల్సిన అవసరంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా తడి ప్రదేశాలను ఏ విధంగా రక్షించుకోవాలి.. రక్షించడం ద్వారా కలిగే ఉపయోగాలు.. రక్షించకపోతే కలిగే నష్టాలను అనంతపురం, కర్నూలు సర్కిల్ అడవి సంరక్షణ అధికారిణి యశోదాబాయి వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సర్కిల్‌లోని జిల్లా అటవీశాఖ అధికారులు, డివిజినల్ అటవీశాఖ అధికారులు, స్క్వాడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విలేకరి మృతి

హంద్రీనీవా కాలువలో మృతదేహం లభ్యం


హంద్రీనీవా కాలువ నుంచి విలేకరి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

గుంతకల్లు మండల పరిధిలోని బుగ్గ సంగాల గ్రామ సమీపంలో సోమవారం ఉదయం అదృశ్యం అయిన యూట్యూబ్ ఛానల్ విలేకరి తిరుమల రెడ్డి(38) మరణించాడు. ఆయన మతదేహం మంగళవారం ఉదయం హంద్రీనీవా కాలువ వద్ద లభ్యమైంది. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తిరుమలరెడ్డి గుంతకల్లు కేంద్రంగా యూట్యూబ్ ఛానల్ విలేకరిగా పని చేస్తున్నాడు. వార్తల సేకరణ కోసం ఈయన ఎక్కువగా సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించేవారు. దీంతో పాటు ఓ ఆలయ కమిటీ సభ్యులతో ఘర్షణ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం బుగ్గసంగాల హంద్రీనీవా కాలువ వద్ద ఇతను వెళ్తున్న ద్విచక్రవాహనం అనుమానాస్పదంగా పడింది. అప్పటి నుంచి ఇతను కన్పించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు హంద్రీనీవా కాలువలో వెతికారు. ఇందులో భాగంగా మంగళవారం ఆయన మృతదేహం నీటిలో లభ్యమైంది. మృతదేహంపై ఉన్న గాట్లను బట్టి చూస్తే అతన్ని ఎవరైనా చంపి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వార్తలు రాస్తున్నారన్న క్రమంలో అతన్ని హత్య చేశారా..? లేక ఇతని మరణం వెనుక మరో కారణం ఏదైనా ఉందానే అనుమానాలు ఉన్నాయి. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తే అసలు వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.